పథకాలు అమలు చేయలేకనే..

నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనస్థలిపురం, అక్టోబర్ 3 : ఎన్నికల్లో అడ్డగోలుగా హామీలు ఇచ్చి వాటిని అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్‌లో నల్ల కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదన్నారు. ఉజ్జిని హరీశ్‌రావు, గిరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీ అభివృద్ధే లక్ష్యం

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు

ఆర్కేపురం, అక్టోబర్ 3 : డాక్టర్స్ కాలనీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ రోడ్డు నం.4లో చేపట్టనున్న డ్రైనేజీ పనులను శ్రీనివాస్‌రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, సూర్యనారాయణ, ఆచార్యులు, ఉమాపతీ, సత్యనారాయణ, ప్రవీణ్, శంకర్ ఉన్నారు.

అన్నదానం..అభినందనీయం

శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండు సార్లు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమని మదర్ లవ్ ఆర్గనైజేషన్ ఫర్ అవేర్నెస్ రూరల్ డెవలాప్‌మెంట్ ఫౌండర్ డాక్టర్ ఏ శ్రీనివాస్ అన్నారు. మహాలయ అమావాస్య సందర్భంగా గురువారం రాత్రి చంపాపేట శ్రీ అన్నపూర్ణేశ్వరి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోశ్‌లడ్డ, ప్రవీణ్, వెంకటేశ్, చింటు, రాజు, అండేకార్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. – చంపాపేట, అక్టోబర్ 3

బాలాత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు

బండ్లగూడలోని జీఎస్ఐలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్ఐ సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సూరజ్ దామోజీ పటభజే

సీఆర్ ఎన్‌క్లేవ్ పోచమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు

అమ్మవారి పూజల్లో.. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

బాలా త్రిపురసుందరిదేవి అవతారంలో దర్శనమిచ్చిన దేవీమాత

శ్రీ బాలాత్రిపుర సుందరి అవతారంలో చిత్తారమ్మ అమ్మవారు

ప్రసన్న మహంకాళి ఆలయంలో..

వైష్ణవి దేవిగా దర్శనమిస్తున్న శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారు

ఎల్బీనగర్, అక్టోబర్ 3 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు బాల త్రిపుర సుందరి , శైలపుత్రి అవతారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. మోహన్‌నగర్ చిత్తారమ్మ దేవాలయంలో తొలిరోజు బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారిని పూజించారు. నాగోలు శ్రీ చండీ శాక్తా మండల్ ఆధ్వర్యంలో మహంకాళి ఆలయంలో శైలపుత్రి అవతారంలో అమ్మవారు దర్శన మిచ్చారు.

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధి సీఆర్ ఎన్‌క్లేవ్‌లోని స్వయంభూ పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వైస్‌చైర్మన్ శంకరయ్య పాల్గొన్నారు.

కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

శ్రీసాయినగర్‌కాలనీ శ్రీదుర్గాదేవి ఆలయంలో నవరాత్రులను ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బాలా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

చంపాపేట : హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శ్రీ సరస్వతి అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి వి.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. శక్తి హనుమాన్ ఆలయంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాల్లో కొక్కొండ సూర్యప్రకాశ్ గుప్తా రమాదేవి, తేడేటి నరసింహారెడ్డి, గజ్జల విజయ భాస్కర్‌రెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత గజ్జల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్కేపురం : గ్రీన్‌హిల్స్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి ఉత్సవాలను గురువారం పగిళ్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

వనస్థలిపురం : హరిహరపురం కాలనీలోని త్రిశక్తి అమ్మవార్ల దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

మలక్‌పేట : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సలీంనగర్‌లోని గణపతి దేవాలయంలో బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారు దర్శన మిచ్చారు. ఆలయక మిటీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీపురం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : మలక్‌పేట బి-బ్లాక్‌లోని పార్వతీదేవి ఆలయంలో గురువారం దేవీ శరన్నవరాత్రోత్సవాల ఎంతో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆర్కేపురం : వారాహీ సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

బండ్లగూడలోని జీఎస్ఐ కార్యాలయం ప్రాంగణం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహాయజ్ఞం, గణపతిపూజ, మహా హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. జీఎస్ఐ సంస్థ అడిషనల్ డైరెక్టర్ జనరల్, హెచ్ఓడీ సూరజ్ దామోజీ పటభజే, డైరెక్టర్ హార్మోహన్ మిశ్రా, శైలేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. – చంపాపేట

రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదు

● మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి

ఆనంద్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న సబితారెడ్డి

కందుకూరు, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల చిన్నచూపు తగదని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. మండల పీఏసీఎస్ డైరెక్టరు పొట్టి ఆనంద్‌కు హైదరాబాదు, జిల్లా సమకార కేంద్ర బ్యాంక్ డైరెక్టరుగా ఎస్సీ కోటా కింద కో ఆప్షన్ మెంబరుగా ఎంపికయ్యారు.ఆ నియామకపత్రాన్ని ఆనంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని పేర్కొన్నారు. రూ. 2లక్షలను ఒకేసారి రుణ మాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం దురదృష్టకరమని తెలిపారు. రైతు బంధు పథకం కింద రూ, 15వేలను ఇస్తానని చెప్పి ప్రభుత్వం మోసం చేస్తుందని తెలిపారు. రైతుల పక్షాన ఉంటూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని కోరారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, నాయకులు కాకి ధశరథ ముదిరాజ్ , డైరెక్టరు నర్సింహ, మాజీ ఎంపీటీసీ సురేశ్, సురుసాని సుదర్శన్‌రెడ్డి, దేశం క్రిష్ణారెడ్డి, దయ్యాల శ్రీనివాస్, మేరుగు రాజు, దయానంద్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, అక్టోబర్ 3 : రైతుబజార్ వద్ద జరిగిన కూల్చివేతల్లో పూలు, పండ్ల షాపులు కోల్పోయిన బాధితులు గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిశారు. 30 ఏళ్లుగా చిరువ్యాపాలరు చేసుకుని జీవిస్తున్న తమను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను 3నెలలుగా అనారోగ్యంతో ఉండడంతో రాలేక పోయానన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు అండగా ఉంటామన్నారు. అధికారుతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, ముద్దగౌని సతీష్‌గౌడ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

మ్యాక్స్ విజన్ చౌరస్తా వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి దంపతులు, మహిళలు. – మలక్‌పేట, అక్టోబర్ 3

అల్మాస్‌గూడలో అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

బడంగ్‌పేట, అక్టోబర్ 3 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లో ఎక్కడ కూడ అంగన్ వాడీ కేంద్రం లేదని శ్రీ హిల్స్ కాలనీ అధ్యక్షుడు బహుగుణ నాయక్ తెలిపారు. ఎటు ఐదు కిలో మీటర్ల దూరంలో అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 26వ డివిజన్‌లో అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. శ్రీహిల్స్, తిరుమల హిల్స్, ఫేస్-1, ఫేస్-2, ఫేస్ -3 కాలనీలతో పాటే అనేక కాలనీలలో చాలా మంది పేద ప్రజలు ఉన్నారన్నారు. పిల్లలు పౌష్టిక ఆహారం లోపంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంగన్ వాడీ కేంద్రాల నుంచి వచ్చే ఫుడ్ ఇక్కడి పిల్లలకు అందడం లేదని అన్నారు. అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తే 26వ డివిజన్ కాలనీ లలో ఉన్న వారికి మేలు జుగుతుందని ఆయన తెలిపారు.

ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

వీఎం హోం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

ఆర్కేపురం, అక్టోబర్ 3 : ఇంకుడు గుంతలను నిర్మించి వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ నాగేందర్ అన్నారు. జలమండలి సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విక్టోరియా మెమోరియల్ రెసిడెన్సియల్ స్కూల్ ఆవరణంలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చేందుకు 90 రోజుల పత్యేక కార్యచరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే సీవరేజ్ పైపులైన్ల నుంచి వ్యర్థాలను, పేరుకుపోయిన మట్టిని తొలగించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా ఇంటింటా ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటి సేకరణ ప్రోత్సహించడం ద్వారా భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రత్యేక కార్యచరణకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.సురేందర్, శివప్రసాద్, రవీంద్రనాథ్‌వర్మ, సురేశ్, రజిత, స్రవంతి, రమ్య తదితరులు ఉన్నారు.

గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా గాంధీ జ్ఞాన మందిర్‌లో పలు రంగాల్లో సేవలు అందిస్తున్న రామచందర్‌రావుకు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరిస్తున్న నిర్వాహకులు. – ఆర్కేపురం, అక్టోబర్ 3

మూసారాంబాగ్‌లో ప్రారంభమైన బాధితుల తరలింపు

మలక్‌పేట, అక్టోబర్ 3 : మూసీ రివర్ బెడ్‌లోని బాధితుల తరలింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. చాదర్‌ఘాట్ మూసానగర్, పాత మలక్‌పేట లోని శంకర్‌నగర్‌లో బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చి వారిని అక్కడినుంచి తరలించిన రెవెన్యూ అధికారులు మంగళవారం లేబర్లతో పాక్షిక కూల్చివేతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాధితులంతా వెళ్లిపోవటంతో ఖాళీ అయిన ఇండ్లను కూల్చే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమైనారు. గురువారం కంప్రెషర్ వాహనాల(కంప్రెషర్ ట్రాక్టర్లను)ను తెప్పించి మిగిలిన అవశేషాలను (గోడలను)తొలగించే పనులు చేపట్టారు. శంకర్‌నగర్, మూసానగర్‌లలో కలిపి మొత్తం 225 నిర్మాణాలను గుర్తించిన అధికారులు బాధితుల్లో 147 మందికి చంచల్‌గూడ పిల్లిగుడిసెల డబుల్ బెడ్రూం బ్లాక్‌లలో ఇండ్లను కేటాయించారు. మిగతావారికి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డబుల్ బెడ్రూం కేంద్రాలకు తరలించారు.

స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎంఐఎం నాయకులు ..

రివర్ బెడ్‌లోని బాధితుల తరలింపు పూర్తి కావటంతో వాటిని అనుకొని ఉన్న మిగతా ఇండ్లకు కూడా మార్కింగ్ చేస్తారని ఎంఐఎం నాయకులు తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదనను వ్యక్తంచేస్తున్నారు. ఈ తరలింపు ప్రక్రియలో కూడా అధికారులకంటే వారే ముందుండి ఖాళీ చేయించారని స్థానికులు ఆరోపించారు.

కూల్చివేతలకు సిద్ధంగా ఉన్న కంప్రెషర్ వాహనాలు

అధిక శాతం ఎంఐఎం లీడర్లకే లబ్ధి..

మూసీ రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాల్లో అధిక శాతం స్థానిక ఎంఐఎం లీడర్లవేనని, ఒక్కొక్కరికీ పది నుంచి 12 ఇండ్ల వరకు ఉన్నాయని. వాటన్నింటిని అద్దెకు ఇచ్చారని వారు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల పేరిట కరెంట్ మీటర్లు తీసుకున్నారని, ఇప్పుడు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లల్లో అధికశాతం లీడర్లే లబ్ధిపొందారని స్థానిక మహిళలు పేర్కొనటం గమనార్హం.

మూసారాంబాగ్‌లో నాలుగురోజుల క్రితం మార్క్ వేసిన సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు గురువారం బాధితుల తరలింపు చేపట్టారు. మొత్తం 109 నిర్మాణాలకు మార్కింగ్ చేసిన అధికారులు వారికి డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించేందుకు ఐదు ఆప్షన్లను ఇచ్చారు. ప్రతాపసింగారం, జంగంమెట్టు, జియాగూడ, కొల్లూరు, కమలానగర్(ముషీరాబాద్) నచ్చిన చోటికి వెళ్లవచ్చునని తాసీల్దార్ జయశ్రీ బాధితులకు సూచించారు. అయితే 30 మంది ప్రతాపసింగారం వెళ్లేందుకు అంగీకరించగా, మిగతావారు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు సంసిద్ధతను వ్యక్తంచేసినట్లు తాసీల్దార్ జయశ్రీ తెలిపారు.

శుక్రవారం మధ్యాహ్నం వరకు సాయిలు హట్స్, అంబేద్కర్‌నగర్ బస్తీ, జాంబవంతుని హట్స్, అజయ్ హట్స్‌లోని బాధితులను తరలించనున్నట్లు ఆమె తెలిపారు.

గోడల్లో మిగిలిపోయిన సామాగ్రిని తీసుకుంటున్న బాధితులు

చెంచల్‌గూడ డబుల్ బెడ్రూం ఇండ్లకు సామాన్లు సర్దుకొని వెళ్తున్న ఓ బాధిత కుటుంబం

పెండింగ్‌లో హాస్టళ్ల బిల్లులు విడుదల చేయాలని వినతి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం సమర్పిస్తున్న కూరెళ్ల మహేశ్‌కుమార్ తదితరులు

మలక్‌పేట, అక్టోబర్ 3 : పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల అద్దె భవనాల బిల్లులు, మెస్ చార్జీలు, హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్ల జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్‌కుమార్, సభ్యులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రాన్ని సమర్పించారు. రెండేళ్లుగా అద్దె భవనాల బిల్లులు, ఎనిమిది నెలలుగా మెస్ చార్జీలు, ఆరు నెలలుగా వర్కర్లకు జీతాలు చెల్లించకపోవటంతో హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. సకాలంలో మెస్ చార్జీలు, అద్దెలు, వర్కర్ల జీతాలు విడుదల చేయాలని అన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్, వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

పేరుకుపోయిన చెత్తను పరిశీలించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ యాదయ్య

హయత్‌నగర్, అక్టోబర్ 3 : హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీ యాదయ్యకు హయత్‌నగర్ డివిజన్‌లోని భాగ్యలత కాలనీ భరత్ పెట్రోల్ బంక్ వద్ద నెలకొన్న పారిశుధ్య పరిస్థితిని కార్పొరేటర్ వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాంకీ సిబ్బంది డంపింగ్ యార్డుల వద్ద చెత్తను తొలగించడం లేదన్నారు. దాంతో కాలనీల్లో దుర్వాసన, దోమల బెడదతో అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. జవాన్ యాదయ్య, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

బాలుడిపై లైంగిక దాడి..పదేండ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టులు,అక్టోబర్3(నమస్తే తెలంగాణ): కామంతో కళ్లకు మూసుకుపోయి హాస్టల్‌లో చదువుకుంటున్న బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డ నిందితుడు మహ్మద్ అబ్దుల్ మాజిద్(23)కు పది సంవత్సరాల కఠినకారాగార శిక్ష తోపాటు రూ.16వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి పద్మావతి తీర్పునిచ్చారు. ప్రత్యేక పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. సరూర్‌నగర్ పరిధిలోని తెలంగాణ మైనార్టీ బాలుర వసతి గృహంలో ఆసీఫ్‌నగర్‌కు చెందిన బాలుడు(13) ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. అదే హాస్టల్‌లో హౌస్‌కీపర్‌గా పనిచేసే నిందితుడు మాజీద్ 2018 ఏప్రిల్‌లో నెలలో నిద్రపోతుండగా బలవంతంగా తీసుకువెళ్లి అసహజ లైంగికదాడికి పాల్పడి ఎవరికి చెప్పద్దని బాలుడుని బెదిరించాడు. కొన్నాళ్లకు సెలవులకు ఇంటికి వెళ్లిన బాలుడు జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలపగా సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకున్న పోలీసులు నిందితుడుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితునికి పండేళ్ల శిక్ష విధించింది. బాధితుడికి పరిహారం కింద రూ.5లక్షలు చెల్లించాలని న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.

మండల ప్రత్యేక అధికారిగా సుధారాణి

మండల ప్రత్యేక అధికారిగా వ్యవసాయ శాఖ ఏడీఏ సుధారాణి నియమితుఅయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన వెంకట్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆమెను నియమించారు. గురువారం బాధ్యతలను స్వీకరించిన ఆమెను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. మండల పరిషత్ సూరిండెంట్ సులోచన, ఎంపీఓ గీత, వ్యవసాయ అధికారి క్రిష్ణమోహన్, ఏఈఏ రాజు ఉన్నారు. –కందుకూరు, అక్టోబర్ 3

స్వచ్ఛ భారత్ దివస్

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డైరెక్టర్ వినోద్ కుమార్

మాదన్నపేట, అక్టోబర్ 3 : ఐసీఎఆర్-సీఆర్ఐడీఎ (క్రీడా) స్వచ్ఛ భారత్ దివస్ వేడుకలు నిర్వహించారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం ముగిసిందని అధికారులు తెలిపారు. క్యాంపస్, యూనిట్, గ్రామాల్లో రైతులు మరియు పౌర సమాజంతోకూడిన కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడా డైరెక్టర్ వి.కె. సింగ్ విద్యార్థులచే స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన రంగోలీ, క్విజ్ పోటీల్లో విజేతలకు డైరెక్టర్ వినోద్‌కుమార్‌సింగ్ బహుమతులు అందజేశారు.